క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి 0863–2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



లక్ష్మీపురం: అఖిల భారతీయ యువజన సమైఖ్య ఏఐవైఎఫ్ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో బొమ్మల సెంటర్, చాకలగుంట 17వ డివిజన్‌లో అఖిల భారత యువజన సమైఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదం కోరుతూ ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్న పోతుల శ్రీనివాసరావు, చల్లా మరియదాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే ఎన్నికల ఇచ్చిన హామీల్లో వాగ్దానాలు తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. యువతకు నిరుద్యోగ భృతి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలు తక్షణమే, భర్తీ చేయాలని కోరారు. లేనిపక్షంలో గుంటూరు నగరంలో ఉన్న యువత మొత్తాన్ని సమీకరించి మరిన్ని ఆందోళనల ద్వారా ఉద్యోగాలు సాధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుంకర రామారావు, రాజేష్, కృపారావు, పవన్, తాతారావు, వివేక్‌నంద పాల్గొన్నారు.

ఉల్లాసంగా గ్రాండ్ మ్యూజికల్ నైట్



నగరంపాలెం: స్థానిక ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శిల్పారామంలో సంగీత ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రాండ్ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. సభకు నిర్వాహకులు ఎస్.వెంకట్ అధ్యక్షత వహించారు. ప్రముఖ గాయని మున్ని ఆధ్వర్యంలో గాయనీ, గాయకులు రసూల్‌బాబు, బాబూరావు, సుబ్రహ్మణ్యం, మోహన్, సన, జరీనాలు గాత్రధారణలో అలనాటి హిందీ, తెలుగు చిత్రాల్లోని గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ మృదంగ విద్వాంసులు తిరునగరం ప్రభాకర్ రావు, ప్రముఖ సంగీత విద్వాంసులు తిరునగరం శ్రీహరిబాబులను సత్కరించారు. డాక్టర్ అశోక్‌ఆనంద్ కొప్పుల వ్యాఖ్యతగా వ్యవహరించగా, మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు, సీఐడీ డీఎస్పీ గోలీ లక్ష్మయ్య, కన్నా విద్యా సంస్థల అధినేత కన్నా మాస్టారు, సామాజిక కార్యకర్త అమనుల్లాఖాన్ పాల్గొన్నారు.

సందేశాత్మకంగా చిగురు మేఘం నాటిక



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఎన్టీఆర్ కళాపరిషత్ 20వ నాటకోత్సవాల్లో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కె.ఆర్.కె. ఈవెంట్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. లక్ష్మీప్రణీత, పుణ్యవతి, సోనిక, నాగదివ్యశ్రీ, జ్ఞానితి, లాస్య, భోగ్యశ్రీ, మనస్విని పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించగా, ప్రేక్షకులను అలరించాయి. అనంతరం అమరావతి ఆర్ట్స్(గుంటూరు) ఆధ్వర్యంలో కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించిన చిగురు మేఘం నాటికను ప్రదర్శించారు. నాటిక సందేశాత్మకంగా కొనసాగింది. నాటకోత్సవాల్లో పరిషత్ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, బొప్పన నరసింహారావు (బుజ్జి), జి.మల్లికార్జునరావు, వేములపల్లి విఠల్ పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

రెండు ఇళ్లలో చోరీ

గుంటూరు రూరల్: రెండు ఇళ్లలో నగలు, నగదు చోరీ చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. నాయుడుపేటలోని భాగ్యనగర్ కాలనీలో శ్రీనివాసనాయక్ అనే వ్యక్తి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో పండుగ సెలవుల నిమిత్తం ఊరు వెళ్ళి తిరిగి వచ్చి చూడగా ఇంట్లోని బీరువా తెరిచి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. అదే విధంగా పక్కనే ఉన్న మరో ఇంటిలో చోరీ జరిగినట్లు గుర్తించారు. శ్రీనివాసనాయక్ ఇంట్లో 200 గ్రాముల బంగారం, కొంత మొత్తంలో నగదు చోరీ జరిగినట్లు పక్కన ఇంట్లో 50 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అనధికార కుళాయిలు తొలగించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరంలో వార్డు సచివాలయాల వారీగా అనధికార కుళాయిల తొలగింపుపై ఇంజినీరింగ్, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శ్యామలనగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, బ్రాడీపేట, లక్ష్మీపురం, పెద్ద పలకలూరు రోడ్ ప్రాంతాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులు, గుజ్జనగుండ్ల సెంటర్‌లో వెండింగ్ జోన్ ప్రతిపాదిత ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. తొలుత శ్యామలా నగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు అనధికారికంగా మున్సిపల్ ట్యాప్‌లు ఉండటం గమనించి, సంబంధిత పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. బహుళ అంతస్తు భవనాల్లో ఫ్లాట్ల వారీగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం వేచి ఉండకుండా ఆస్తి పన్ను విధించాలని అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. భవనాల ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా, బహుళ అంతస్తు భవనాలు డ్రెయిన్‌ని అవుట్ ఫాల్ డ్రెయిన్ వరకు కనెక్ట్ చేయాలన్నారు. నివాస ప్రాంతాల్లో గేదెల డెయిరీ ఏర్పాటు చేసి, వ్యర్థాలను డ్రెయిన్‌లోకి వదులుతున్న వారికి నోటీసులు జారీ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని కోరారు. పలు ప్రదేశాల్లో డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రతి రోజు మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా కాల్వలు శుభ్రం చేయాలని, డెబ్రిస్‌ని ప్రత్యేకంగా ట్రాక్టర్లను తీసుకొని లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. గుజ్జనగుండ్ల ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ మానం పద్మశ్రీ, పట్టణ ప్రణాళిక అధికారులు, స్ట్రీట్ వెండర్స్ కలిసి పర్యటించి, త్వరలో గుజ్జనగుండ్ల ప్రాంత వీధి వ్యాపారులకు అనువుగా ఉండేలా వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, వెంకటేశ్వరరావు, డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యతోనే విజ్ఞానంతో పాటు విజయాలు సొంతం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, తదితరులు

పట్నంబజారు: 'ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువొక్కటే' అన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాటలు అక్షర సత్యాలని శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ న్యూ మోడల్ టెస్ట్ పేపర్ – 2025 పుస్తకాలను ఉచితంగా అందజేయాలన్న సంకల్పంతో.. అందుకోసం ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ విద్యతో కేవలం విజ్ఞానం మాత్రమే కాదు, అద్భుతమైన విజయాలు సాధించవచ్చు, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నిర్దేశించుకోవచ్చాన్నారు. చదువు లేనిదే భవిత లేదన్న వాస్తవాన్ని తెలుసుకుని ఎన్ని ఆటంకాలు ఎదురైనా కష్టపడి – ఇష్టపడి చదువును కొనసాగించాలని విద్యార్థులను కోరారు. ఈ సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే ఎస్ఎస్‌సీ న్యూ మోడల్ టెస్ట్ పేపర్– 2025 పుస్తకాన్ని వారికి ఉచితంగా అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పుస్తకం కావలసిన విద్యార్థులు స్ఫూర్తి ఫౌండేషన్ వెబ్‌సైట్‌లో దీని కోసం ప్రత్యేకంగా https://spoorthyfoundation.org రూపొందించిన ఈ లింక్‌లోని యాప్‌లో తమ పూర్తి వివరాలు నమోదు చేసుకుంటే వారికి తామే స్వయంగా పుస్తకాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, కార్యదర్శి పానాల సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పోలే ముత్యం, కంజుల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం తేవాలి



మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

నగరంపాలెం: శరీర అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు ఉద్యమంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిల భారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. అరండల్‌పేట ఆర్య సమాజం సమావేశ మందిరంలో ఆదివారం వల్లూరి రాజారత్నం, కోటేశ్వరరావు సంస్మరణ సందర్భంగా బంధుమిత్రులు రక్త సంబంధీకులు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి విద్యావేత్త గడ్డిపాటి పద్మరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మీ మాట్లాడుతూ మనిషి పార్థివదేహాన్ని ఖననం చేయడం కంటే, అవసరమైన వారికి అవయవాలు దానం చేస్తే మనిషి చనిపోయినా జీవిస్తాడని అన్నారు. ఆర్య సమాజం అధ్యక్షురాలు గుర్రం నిర్మలదేవి మాట్లాడుతూ శతాబ్దాల పాటు భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయంగా ఉందని అన్నారు. అనంతరం రాజ్యాంగ పీఠిక పుస్తకాలను పంపిణీ చేయగా, ఆవరణలో మొక్కలు నాటారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు విశిష్ట సేవ పురస్కారాలను అందించారు. సమావేశంలో నూతలపాటి తిరుపతయ్య, ఓరుగంటి నారాయణరెడ్డి, కల్లూరి మురళీధరరావు, పావులూరి రమేష్, ఎండీ.ప్రసాద్, మందా సురేంద్ర, యర్రం సుబ్బారెడ్డి, గుంటూరు విజయకుమారి, వైవీఎస్ఎస్ జయలక్ష్మ, పాట్లూరి దేవి, వల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

నసీమకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్అండ్ ఇంజినీరింగ్ పరిశోధకురాలు షేక్ నసీమకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రిసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో యాన్ ఇంప్రూవ్డ్ సెక్యూర్ బ్లాక్ చైన్ ఫ్రేమ్‌వర్క్ ఎనేబుల్ ఎఫిసియెంట్ మేకింగ్ డిజిటల్ ఆర్టి ఫ్యాక్ట్, యాజ్ ఇమ్యూటబుల్, రిలయబుల్, వేరిఫయబుల్, యూజింగ్ దీ సెంట్రలైజ్డ్ హాష్ యూఆర్ఐ ఆన్ వెబ్ సోర్సెస్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు గాను డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు.

వైభవంగా యోగి వేమన జయంతి ఉత్సవాలు



నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో శ్రీబాలభారతి బాలల సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం యోగి వేమన జయంతి ఉత్సవాలు జరిగాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రం సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. వేమన సాహిత్య ప్రచారకులు ఎస్.మహేష్ రావు(వేమన మహేష్), వి.కన్నయ్య వేమన పద్యాలాపన చేయగా, సబికులను అలరించాయి. అన్నదాన సమాజం ఈఓ జి.శ్రీనివాసరావు, విజ్‌డమ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ అధినేత కాళంగి వంశీకృష్ణ మానవతా విలువలపై ప్రసంగించారు. సమాజ సేవలు అందిస్తున్న కె.రవీంద్రబాబుకు కరుణ కిరణం పేరుతో సత్కరించారు. ఉత్సవాల్లో సమన్వయ కర్త బి.రాజశేఖర్, శ్యామల, కోటిరెడ్డి శేషగిరిరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు పంపిణీ



పెన్షన్ పంపిణీ చేస్తున్న తాండవకృష్ణ, అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్– ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం ఆధ్వర్యంలో 108 మంది పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆదాయపు పన్నుశాఖ సంయుక్త కమిషనర్ ఏ తాండవ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెల 108 మంది పేదలకు ఒక్కొక్కరికి 500 రూపాయలు చొప్పున పెన్షన్ ఇవ్వడంతోపాటు విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి తేజో శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు అందించడంతోపాటు ప్రతివారం గో సేవ నిర్వహించటంపై హర్షం వ్యక్తం చేశారు. అవోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తన వంతుగా ఒక నెల పెన్షన్ రూ.60 వేలు విరాళం ప్రకటించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు చాంబర్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రముఖ ఆడిటర్ గార్లపాటి సత్యనారాయణ మాట్లాడుతూ అవోపా సమాజ సేవకు ఎల్లప్పుడూ ముందు ఉంటుందని, పేదలను ఆదుకోవడం పేదల ఉన్నతికి వివిధ రకాల కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ అవోపా శాఖల ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అంశాల్లో రాష్ట్రస్థాయిలో వివిధ పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ, వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అడ్డగాళ్ల రామారావు పేద విద్యార్థులకు 20 వేల రూపాయలు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, ఊటుకూరి నాగేశ్వరరావు, రమణనంద్, వరప్రసాద్, చామర్తి రమేష్ పాల్గొన్నారు.

షుగర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటసందీప్

లక్ష్మీపురం: మధుమేహంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకటసందీప్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన మధుమేహం అవగాహన సభ ఆదివారం నిర్వహించారు. ఆరోగ్యసభలో ఆయన మాట్లాడుతూ మధుమేహం వచ్చినవారిలో దాహం ఎక్కువగా అవ్వడం, మూత్ర విసర్జనకు ఎక్కువ సార్లు వెళ్లాల్సి రావడం, నీరసం, ఆకలి ఎక్కువ అవ్వడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పొన్నారు. కావున ప్రతిఒక్కరూ 40 సంవత్సరాలు దాటితే, సంవత్సరానికి ఒక్కసారి షుగర్ పరీక్ష చేయించుకుంటే మంచిదని సూచించారు. ముడి బియ్యం, చిరుధాన్యాలు కూడా ఆహారంలో భాగం చేసుకోవాలని చెప్పారు. రోజూ కనీసం ఒక అరగంట వ్యాయామం చేస్తూ, మానసిక ఒత్తిడులకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. తద్వారా మధుమేహం రాకుండా చూసుకోవచ్చు లేదా కొంతకాలం వాయిదా వేయవచ్చు అని అన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ నందిపాటి వెంకట సందీప్‌ను ఘనంగా సత్కరించారు. ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా సిహెచ్.సుబ్బారెడ్డి, పూర్ణచంద్రరావు పాల్గొని ప్రసంగించారు.

కూలి రేట్ల పెంపు హర్షణీయం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో పనిచేస్తున్న దాల్ మిల్లు ముఠా కార్మికులకు మిల్లర్స్ అసోసియేషన్ కూలీ రేట్ల పెంపునకు అంగీకారం తెలపటం హర్షణీయమని ఏఐటీయూసీ గుంటూరు నగర గౌరవ అధ్యక్షులు ఎ.సురేష్ బాబు, అధ్యక్షులు రావుల అంజిబాబు తెలిపారు. సంగడిగుంట నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం, రేగుల రాఘవయ్య భవన్లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన గుంటూరు దాల్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో దాల్ మిల్లర్స్ యాజమాన్యంతో ఏఐటీయూసీ, దాల్ మిల్లు ముఠా కార్మిక సంఘం చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ చర్చల సందర్భంగా కూలి రేట్లు పెంపునకు యాజమాన్యాలు అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇస్తున్న కూలీరేట్లకు అదనంగా 15శాతం పెంచడానికి ఈ చర్చలలో నిర్ణయించడం జరిగిందన్నారు. పెరిగిన కూలి రేట్లు ఈనెల 20వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని నాయకులు వెల్లడించారు. సమావేశంలో దాల్ మిల్లు ముఠామేస్త్రీలు పొందుగుల యలమందరెడ్డి, దేవరపల్లి శివారెడ్డి, ఏనుగంటి వెంకట్రావు, సిరిగిరి దుర్గా, దోర్నాల సోమిరెడ్డి, కె. సుబ్బారావు, కోటయ్య పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



శ్రీత్యాగరాజస్వామి వారి కీర్తనలతో..

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట శ్రీమోహన రంగనాయక స్వామి దేవస్థానంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీసరస్వతి సంగీత విద్వత్ సభ ఆధ్వర్యంలో నిర్వహించగా, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం(భద్రాచలం) ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామచార్యులు, వనజ దంపతులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు అనంతరం విశ్వ సంకీర్తనాచార్యులు మాడభూషి నరసింహాచార్యులు 'ఘనరాగ కతుల పంచరత్న గోష్టి' గానం చేపట్టారు. అనంతరం నరసింహాచార్యులు, శిష్య, ప్రశిష్యుల బృందం 'లఘు అఖండము' పేరుతో అత్యంత భక్తి శ్రద్ధలతో 12 గంటల పాటు నిర్విరామంగా శ్రీత్యాగరాజస్వామి కీర్తనలతో సంగీతార్చన నిర్వహించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, ధూళిపాళ్ల శ్రీనివాస్, చావలి శ్రీనివాస్, మృదంగంపై బీరకాయ సురేష్‌బాబు, కె.జగన్మోహిని, చావలి కృష్ణమోహన్ వాయిద్యా సహకారం అందించారు. కార్యక్రమంలో గడియారం సువర్ణవిద్య, ఎం.శారద, వామన్‌కుమార్, దేవస్థానం ట్రస్ట్ దేశరాజు పట్టాభిరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలో వాసవి క్లబ్ గుంటూరు, మహిళ, యువ(2025) కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్షులుగా రాయవరపు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కూనిశెట్టి చంద్రశేఖర రావు, కోశాధికారిగా వేమూరి ప్రదీప్‌కుమార్, వాసవి క్లబ్ మహిళా అధ్యక్షురాలిగా రాయవరపు అనూరాధ, ప్రధాన కార్యదర్శిగా కూనిశెట్టి విజయలక్ష్మి, కోశాధికారిగా పరుచూరి చంద్రికకిషోర్, పలు పథకాలకు సంబంధించి చైర్మన్, కో– చైర్మన్‌లతో క్లబ్ జిల్లా గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథులుగా క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు, మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు హాజరై మాట్లాడారు. సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాలను, కమిటీ, క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ నుంచి జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 133వ ఉరుసు ఉత్సవాలు



ఊరేగింపుగా గంధం తీసుకువస్తున్న ధర్మకర్త



ప్రత్యేక అలంకరణ..

నగరంపాలెం: హిందూ, ముస్లింలు ఐక్యంగా ఆరాధించే హజరత్ కాలే మస్తాన్ షా అవులియా బాబా 133వ ఉరుసు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నగరంపాలెం దర్గాలో ఆదివారం రాత్రి పది గంటలకు గ్యార్మి షరీఫ్(ఖురాన్ పఠనం) నిర్వహించారు. దర్గాను పలు రకాలతో అందంగా అలకరించారు. మేళా తాళాలు, డప్పులు, వేషధారణలతో పరిసర వీధుల్లో సందడి వాతావరణం నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున్న భక్తులు హాజరయ్యారు. భక్తుల రాకతో దివ్య మందిరం, పుర వీధులు కిక్కిరిశాయి. ధర్మకర్త రావి రామ్మోహన్‌రావు గంధంను ఊరేగింపుగా తీసుకువచ్చి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం బుట్ట బొమ్మలు, కోలాటాలతో కనుల పండువగా నిర్వహించారు.

పోస్టల్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన డీఎస్ఎన్

సంస్మరణ సభలో ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ సి.కాశీం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

తెనాలి: గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల సాధనకు ఢిల్లీ వరకు ఉద్యమాన్ని నడిపి వారి జీవితాల్లో వెలుగులు నింపిన పోస్టల్ ఉద్యమనేత దేవిరెడ్డి శివనాగేశ్వరరావు (డీఎస్ఎన్) ఆరంభించిన ప్రయాణాన్ని పరిపూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాశీం అన్నారు. గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా అందరినీ సమీకరించి ఐక్యవేదిక ద్వారా అద్భుతమైన విజయాలను సాధించిన ఉద్యమనేత డీఎస్ఎన్ సంస్మరణ సభను ఆదివారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఎం.తిరుమలరావు అధ్యక్షతన జరిగింది. ప్రొఫెసర్ కాశీం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, నేడు దేశంలో పెట్టుబడిదారుల ప్రగతే దేశ అభివృద్ధి నమూనాగా మారిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు బాటన పట్టిస్తున్నారని విమర్శించారు. దేశాన్ని టోకున విదేశీ కంపెనీలకు తాకట్టు పెట్టే అభివృద్ధి నమూనా జరుగుతోందని చెప్పారు. డీఎస్ఎన్ బాటలోనే ఐక్యంగా ఉద్యమించి హక్కులను కాపాడుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యావంతుల ఐక్యవేదిక నాయకుడు అంబటి నాగన్న మాట్లాడుతూ మనిషితత్వాన్ని పరిమళించిన డీఎస్ఎన్, మనిషనేవాడుఎలాంటి జీవితాన్ని గడపాలనే సిలబస్ ఇచ్చాడని చెప్పారు. పీబీవీ గణేష్ మాట్లాడుతూ ఉద్యమనేతగా సాధారణ పోస్టల్ ఉద్యోగుల హక్కులకోసం కృషిచేసిన డీఎస్ఎన్, వారికోసం సహకార సొసైటీని స్థాపించి 20 ఏళ్లుగా అభివృద్ధి చేయటం గొప్ప విషయమన్నారు. నాలుగువేల మంది సభ్యులతో రూ.పదుల కోట్ల డిపాజిట్లతో నడుస్తున్న సొసైటీలో ఎలాంటి అవినీతి లేకపోవటం డీఎస్ఎన్ కార్యదక్షతకు నిదర్శనమన్నారు. హక్కుల పోరాటంతోపాటు మానవీయ విలువలను ఆయన మనకు అందించారని చెప్పారు. అఖిల భారత గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకుడు బి.వెంకటేశ్వర్లు తన ప్రసంగంలో డీఎస్ఎన్ స్ఫూర్తితోనే తెలంగాణలో గ్రామీణ తపాల ఉద్యోగుల సహకార సొసైటీని స్థాపించానని, అందుకాయన ఎంతగానో సహకరించారని చెప్పారు. సభలో పోస్టల్ ఉద్యోగుల ఏపీ సర్కిల్ కార్యదర్శి పి.ఎస్.డేవిడ్‌రాజు, ఎన్‌యూపీఈ, పీఎంఅండ్ఎంటీఎస్, ఏపీ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎన్‌యూడీఎస్, ఏపీ సర్కిల్ కార్యదర్శి ఎస్.యోగీశ్వరరావు, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్రనేత కె.కృష్ణ, నండూరి నారాయణ, శివకృష్ణ, జనసాహితి నేత చందు నాగేశ్వరరావు, విశ్రాంత వైద్య ప్రొఫెసర్ విజయకుమార్ తదితరులు మాట్లాడారు. ప్రజాకళామండలి కోటి బృందం విప్లవగీతాలను ఆలపించింది.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రెండో వీధిలోని త్యాగరాజ కళా వేదికపై నిర్వహిస్తోన్న సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం నాలుగో రోజుకి చేరాయి. త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ నిర్వహణలో జరగ్గా, లఘు కచేరీలలో భాగంగా ఎం. విజయలక్ష్మి, లంక కళ్యాణి గాత్ర యుగళం, ఆర్.ఫణితేజ, వేణువు, వై.సంపూర్ణరాజ్యలక్ష్మి, వేమూరి సాత్విక, సుబ్రహ్మణ్య శ్రీకర్, అమృతవల్లి, గీతమోహన్, భారతి పవన్‌కుమార్, గోకరాజు లక్ష్మీగాయత్రి, బొల్లవరపు రోహిత, అనుజ్ఞ తమ గాత్రంతో ఆహుతులను అలరించారు. సాయంత్రం వేళ విదుషి రాజమీనాక్షి మురళీధరన్(బెంగళూరు) గాత్ర సంగీత కచేరీలో అనేక త్యాగరాజ కీర్తనలను అలపించారు. వయోలిన్‌పై పి.నందకుమార్, బి.సురేష్‌బాబు వాయిద్యాన్ని అందించారు.